క్లుప్తంగా

కూటమి పాలన దారుణం

మాజీఎమ్మెల్సీ లక్ష్మణరావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ విద్యావ్యవస్థ దారుణంగా బలహీనపడిందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి జాతా కార్యక్రమం సోమవారం సాయంత్రానికి విజయవాడలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణానికి చేరుకుంది. ఈ సందర్భంగా జాతాకు మద్దతు పలికిన లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో రాష్ట్రప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, దసరాకు కనీసం రెండు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అన్ని తాత్కాలిక నియామకాలు చేయడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీన పడిందన్నారు. యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలైన ఉద్యోగులను ఉపాధ్యాయులని పట్టించుకోలేదన్నారు. యుటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార బైకు జాతాలు జరిపి ఉపాధ్యాయులు చైతన్యపరిచి ఈనెల 25న గుంటూరులో రాష్ట్రస్థాయి భారీ సదస్సు నిర్వహించనున్నట్లు వివరించంఆరచు. రణభేరిలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ సుందరయ్య, జిల్లా సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేయించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో వాటర్‌ప్లాంట్ల యజమానులు క్రమం తప్పకుండా నీటిపరీక్షలు చేయించాలని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రైవేట్ ఆర్వో వాటర్ ప్లాంట్స్ యజమానులు, చికెన్-మటన్, సీ ఫుడ్స్ విక్రయదారులు, హోటల్స్, రెస్టారెంట్స్, క్యాటరర్స్‌తో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ నగరంలో డయేరియా, విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్స్ నిర్వాహకులు ని, కెమికల్ ఎనాలసిస్ (టీడీఎస్, పీహెచ్, నైట్రేట్స్, క్లోరినేషన్), బయాలజికల్ టెస్టులు (మైక్రోస్, వైరల్) తప్పకుండా చేయించాలన్నారు. షాపులు, హోటళ్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. డస్ట్‌బిన్లు వినియోగించకుండా వ్యర్థాలను రోడ్లపై పడేసేవారికి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్‌లో వ్యాపారస్తులు ఇస్తున్న డిక్లరేషన్‌ను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, డిప్యూటీ కమిషనర్, ట్రేడ్ అండ్ లేబర్ ఆఫీసర్ జె ధనలక్ష్మి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద సంస్థలో హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, న్యూ రాజీవ్ నగర్ నందు సీసీఆర్ఏఎస్, ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రాజభాష హిందీ పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజభాష హిందీ సంబంధిత పలు కార్యక్రమాలు దేశ భాషపై ఆసక్తిని, గౌరవాన్ని పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. సీనియర్ పరిశోధన అధికారి హిందీ పక్షోత్సవాల ముఖ్య లక్ష్యాలను వివరించారు. హిందీ భాషను కార్యాలయ పనితీరులో భాగంగా మార్చేందుకు ప్రోత్సహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మరో పరిశోధన అధికారి డాక్టర్ సవిత మాట్లాడుతూ.. హిందీ వ్యాస రచన, డిబేట్, పద్యపఠనం, క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కస్టమర్‌పై చాకుతో దాడికి పాల్పడిన యువకుడిని కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్‌కాలనీకి చెందిన అబ్దుల్ కరీముల్లా శనివారం రాత్రి వైవీ రావు రింగ్ సమీపంలోని హోటల్‌లో ఉప్మా అట్టు అడుగగా, సాదా అట్టు పార్సిల్ చేసి ఇచ్చారు. ఇదేమిటని కరీముల్లా హోటల్‌లో పనిచేసే పోలిశెట్టి రాజు(28)ని ప్రశ్నించడంతో అతను చాకుతో దాడి పాల్పడ్డాడు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు రాజును పోలీసులు అరెస్టు చేశారు.

జోరుగా మద్యం అనధికార విక్రయాలు

- వైఎస్సార్ కాలనీలో బెల్ట్‌షాపు నిర్వహణ
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ పోలీసులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు



రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపు వద్ద మందుబాబులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరశివారులో ఉన్న జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలో మద్యం అనధికార విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. లైసెన్స్‌తో నడిచే వైన్‌షాపులు, బార్లకు సమయపాలన ఉండగా, ఈ మద్యం బెల్ట్ షాపునకు అటువంటిదేమీ లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా 24గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. కాలనీల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్న వైనం చూస్తే..ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తామన్న సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు చివరికి ప్రకటనలకే పరిమితమయ్యానే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉదయం ఆరు నుంచే మద్యం విక్రయాలు..

వైఎస్సార్ కాలనీ లోపలకు రాగానే మెయిన్ రోడ్ పక్కనగల ఒక రేకుల షెడ్ (ఉత్తరం ఫేస్)లో గది తీసుకుని నడుపుతున్న మద్యం బెల్ట్‌షాపులో పొద్దున్న 6గంటల నుంచే మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఈ రేకుల షెడ్ దక్షిణం వైపు మొత్తం క్లోజ్ చేసి ఉండటం, పిచ్చి మొక్కలు, మార్చురీ బాక్స్‌లు ఉండటంతో రోడ్డు మీద నుంచి రాకపోకలు సాగించే వారికి ఈ షెడ్ కనబడదు. ఉత్తర ముఖంలో ఉన్న ఈ బెల్ట్ షాపు ముందు పెద్ద ఖాళీ స్థలం ఉండటంతో మందుబాబులు అక్కడే మద్యం తాగిన గ్లాసులు, సీసాలు పడేస్తున్నారు.

టీడీపీ నాయకుడి అండదండలతోనే..

గొల్లపూడికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడి అండదండలతోనే కాలనీలో బహిరంగంగా మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. బెల్ట్ షాప్ నడుతున్న వ్యక్తి ఆ నాయకుడి అనుచరుడేనని కాలనీవాసులు చెబుతున్నారు. అందుకే ఎక్సైజ్ పోలీసులు, కొత్తపేట పోలీసులు ఈ బెల్ట్‌షాపు వైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ బెల్ట్ షాపునకు సమీపంలో ఉండే బార్ లైసెన్స్ కాలపరిమితి ముగియడంతో మూసివేగా, అప్పటివరకు చాటుమాటుగా మద్యం విక్రయిస్తున్న సదరు వ్యక్తి ఇప్పుడు ఏకంగా అనధికారకంగా షాపు పెట్టి మరీ విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నాడని కాలనీవాసులు మండిపడుతున్నారు. మద్యం అలవాటు ఉన్న పలువురు వ్యక్తులు మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లివచ్చినట్లు బెల్ట్ షాపునకు వెళ్లి మద్యం తాగేసి వస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నివసిస్తున్నవారి మంచిచెడులు చూస్తానని చెప్పుకునే సదరు టీడీపీ నాయకుడు ఇలా బెల్ట్‌షాప్ పెట్టించి మద్యానికి జనాన్ని బానిసలుగా మార్చడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి కాలనీలోని మద్యం బెల్ట్ షాపును తొలగించాలని కాలనీ మహిళలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో బెల్ట్ షాప్ వద్ద ధర్నా చేస్తామని మహిళలు హెచ్చరిస్తున్నారు.

మహిళా సమస్యలపై పోరాడాలి : వెలంపల్లి



నన్నం దుర్గాదేవిని సత్కరిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పార్టీలో నూతనంగా పదవులు పొందిన నేతలంతా కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పోరాడాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శిగా నియమితులైన నన్నం దుర్గాదేవి వెలంపల్లి శ్రీనివాసరావును సోమవారం ఆయన కార్యాలయంలోకలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు దుర్గాదేవిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు ఇస్తామని చెప్పిన పథకాలను కూటమి ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు. వైఎస్సార్ నాయకులు మహిళా సమస్యలపై పోరాడాలన్నారు. పార్టీ పటిష్టతకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

గట్కా పోటీలో శ్యామ్‌మనోహర్‌కు గోల్డ్ మెడల్



శ్యామ్ మనోహర్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్ ప్రదానం చేసి అభినందిస్తున్న నిర్వాహకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గట్కా ఛాంపియన్‌షిప్ పోటీలో విద్యాధరపురం రామరాజ్యనగర్‌కు చెందిన పులిపాటి శ్యామ్ మనోహర్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. జాతీయ గట్కా అసోసియేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఏపీ గట్కా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ లయోలా కాలేజీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో అండర్-8 విభాగంలో శ్యామ్ మనోహర్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. విజయవాడలోని లిటిల్ బ్రెయిన్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న శ్యామ్ రెండేళ్లుగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గట్కా క్రీడలో శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా రామరాజ్యనగర్‌లోని శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, హోమియో వైద్యులు పులిపాటి వెంకటేశ్వరరావు, తల్లిదండ్రులు వంశీకృష్ణ, ప్రియాంక, నిర్వాహకులు శ్యామ్‌మనోహర్‌కుమార్‌ను అభినందించారు.

సహజ సిద్ధమైన ఆయుర్వేదం

నగరంలో ఆయుర్వేద వైద్య విద్యార్థుల ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ వైద్యమైన ఆయుర్వేదానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, సహజ సిద్ధ వైద్యం పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలజ్యోతి భాయి అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద ఆస్పత్రుల ఆధ్వర్యంలో సోమవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆయుర్వేద కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆయుర్వేదం ప్రాముఖ్యత, నివారణాత్మక వైద్య పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నినాదాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగింది. ఆయుర్వేద కళాశాల ఆవరణలో ప్రారంభమైన ర్యాలీ నగర ప్రధాన మార్గాల మీదుగా సాగింది.

ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని ప్రతిజ్ఞ

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నిర్మలజ్యోతిభాయి మాట్లాడుతూ సహజ సిద్ధమైన, సుస్థిరమైన ఆరోగ్య విధానాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. భారతదేశ సమృద్ధమైన ఆరోగ్య వారసత్వాన్ని గుర్తుచేసే రోజు ఆయుర్వేద దినోత్సవమని, పరిశోధన, విద్య, ప్రజా సేవల రంగాల్లో యువత ఆయుర్వేదాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చివరగా నివారణాత్మక, ప్రోత్సాహక ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం దోహదం గురించి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోలా విజయకుమారి, సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణవేణి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.బుల్లయ్య, హౌస్ సర్జన్లు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు 400 మంది అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఉన్నా... ప్రయోజనం సున్నా!

- పశ్చిమ వీధుల్లో ధ్వంసమైన స్పీడ్ బ్రేకర్లు
- బ్రేకర్లకు వేసిన మేకులతో వాహనాలకు పంచర్లు
- ఇబ్బందిపడుతున్న వాహనచోదకులు



విరిగిపోయిన రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలోని ప్రధానరోడ్లతోపాటు అంతర్గత రోడ్లపై వేసిన రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు వాహనచోదకుల పాలిటశాపంగా మారుతున్నాయి. ఏడాది కిందట పశ్చిమంలోని అన్ని డివిజన్లలో కార్పొరేషన్ ఈ స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసింది. రద్దీ అధికంగా ఉండే డివిజన్లలో యాభైకి పైగా, అంతర్గత రోడ్లు ఉన్న డివిజన్లలో పదుల సంఖ్యలో ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు నాణ్యత లేకపోవడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలాయి.

ఏడాదికే ధ్వంసం..!

ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లలో మితిమీరిన వేగంతో వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించేలా ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, జనం రద్దీగా ఉండే సెంటర్లలో ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అయితే లోడ్‌తో వచ్చే వ్యాన్లు, ఆటోలు, ఇతర రవాణా వాహనాలతో ఈ స్పీడ్ బ్రేకర్లు రోడ్డు మధ్య భాగంలోనే ఎక్కువ భాగం ధ్వంసమయ్యాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసినా ప్రయోజనం మాత్రం సున్నాగానే మారింది. విరిగిపోయి ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనదారులు తమ వేగాన్ని ఏమాత్రం నియంత్రించకుండానే వెళ్తుండటంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే పాదచారులు, స్కూల్ విద్యార్థులు, వృద్ధులు ప్రమాదాల బారినపడుతున్నారు.

వాహనాల టైర్లకు పంచర్లు...

రోడ్డుపై ఈ రబ్బర్ స్పీడ్ బ్రేకర్లను బిగించేందుకు ఐదు అంగుళాల గొబ్బు మేకులను వినియోగించారు. ఒక్కో స్పీడ్ బ్రేకర్‌కు నాలుగు తక్కువ కాకుండా మేకులను వినియోగించారు. రోడ్డు 30 అడుగుల వెడల్పు ఉంటే అడుగు వెడల్పు ఉన్న స్పీడ్ బ్రేకర్లు 120కి పైగా మేకులను వినియోగించారు. అయితే వాహనాల వేగానికి ఈ స్పీడ్ బ్రేకర్లు విరిగిపోవడంతో ఆ మేకులు అలాగే రోడ్డుపై ఉండిపోతున్నాయి. దీంతో వేగంగా వచ్చే ద్విచక్రవాహనాలు, ఆటోల టైర్లకు ఈ మేకులు దిగబడి పంచర్లు కావడం పరిపాటిగా మారింది. దాదాపు పశ్చిమ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలోని ప్రధాన సెంటర్లలో ఇదే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా వన్‌టౌన్ సుబ్బరామయ్య వీధి, పంజా సెంటర్, వించిపేట గాంధీబొమ్మ సెంటర్, నైజాంగేటు, కేటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ సమస్య వాహనచోదకులను వేధిస్తోంది. విరిగిపోయిన స్పీడ్ బ్రేకర్ల స్థానంలో మిగిలిన మేకులను తొలగించడంతోపాటు తారుతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గాంధీ హిల్ పునరుద్ధరణకు సహకరించాలి

మాజీ మేయర్ జంధ్యాల రవిశంకర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రముఖ పర్యాటక, స్ఫూర్తిప్రదాయనిగా పేర్కొనే గాంధీ హిల్‌ను పూర్తిస్థాయిలో అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని గాంధీ హిల్ ఫౌండేషన్ పాలకవర్గ సభ్యులు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ ఒక ప్రకటనలో కోరారు. మహాత్మాగాంధీ శతజయంతిని పురస్కరించుకొని దేశంలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గాంధీ స్మారక స్థూపాల్లో విజయవాడ గాంధీ హిల్ ఒకటని గుర్తుచేశారు. ఇటీవల అనేక కారణాలతో గాంధీ హిల్ ప్రాంగణంలోని పలు నమూనాలు, ఇతర ప్రాంగణాలు మూలనపడి సందర్శకులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. గాంధీ హిల్ పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మహాత్మా గాంధీ రాష్ట్రంలో పర్యటించిన జ్ఞాపకాలతో కూడిన ఫోటోలు, వస్తువులు, కథనాలు లేదా ఇతర సమాచారం ఉన్నవారు వాటిని గాంధీ హిల్‌పై ఏర్పాటు చేస్తున్న మ్యూజియంలో భద్రపరిచేందుకు అందించాలన్నారు. మరింత సమాచారం కోసం గాంధీ హిల్ కార్యాలయం లేదా ఫోన్ నంబర్ 9440625778ను సంప్రదించాలని ఆయన కోరారు.

దసరా ఉత్సవ మొబైల్ యాప్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల నేపథ్యంలో దేవస్థానం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దసరా ఉత్సవాలు 2025 పేరిట రూపొందించిన ఈ యాప్‌ను సోమవారం దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన ఈ యాప్‌ను ప్లేస్టోర్, యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అమ్మవారి దర్శన వేళలు, రోజు వారి సేవలు, వీఐపీ దర్శన సమయాలు, అమ్మవారి అలంకారాలు, అలంకారం వివరాలు, ఫొటోలు, సేవా బుకింగ్, ఆయా సేవల ప్రత్యక్ష ప్రచారం భక్తులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అమ్మవారి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, ఉచిత అన్న ప్రసాద వితరణ, రవాణా సదుపాయం, దేవస్థాన బస్సుల వివరాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. అత్యవసర సమయాలలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, పోలీసు వారి సేవలు, అగ్నిమాపక కేంద్రాలు, హాస్పిటల్ లొకేషన్లు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ యాప్‌లో మొత్తం 15 అంశాలతో కూడిన వివరాలను భక్తులు తెలుసుకోవచ్చన్నారు. ఇక వాట్సాప్ నంబరు 9441820717 ద్వారా ఏఐ ఆధారిత సంభాషణ, యాత్రికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో శీనానాయక్, సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియ, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని.. మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఆమె వైద్య ఆరోగ్య శాఖ, వివిధ శాఖల అధికారులతో కలిసి స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పుట్టిన ఆడ శిశువు మొదలు మహిళలందరి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ నెల 17వ తేదీన దేశ ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభిస్తారని.. అదే రోజు ఎన్టీఆర్ జిల్లాలోనూ ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని చెప్పారు. అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా క్యాంపుల ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాల్లో అందించే వైద్య సేవలు

మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షల నిర్వహణ తగిన వైద్య చికిత్సలు, రిఫరల్ సేవలను అందిస్తారు. అలాగే మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్సలను అందిస్తారు. గర్భిణులను పరీక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను, తీసుకోవల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇస్తారు. చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేయడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందించడం, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా జరిగే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఎన్‌డీఏకు చెంపపెట్టు : బాజీబాబా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వక్ఫ్ ఆస్తులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు వంటివని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా పేర్కొన్నారు. దేశంలో కేంద్రం తీసుకొచ్చిన నల్లచట్టాలపై అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన ఉత్తర్వులు మైనారిటీలకు ఊరటనిచ్చాయన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చరాదని, ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే నిబంధన వర్తించదని, వక్ఫ్ ప్రాపర్టీ ఖరారు అధికారం కలెక్టర్లది కాదని ట్రిబ్యునల్‌దేనని అత్యున్నత న్యాయస్థానం పేర్కొనదంటూ హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



మాట్లాడుతున్న గోపీరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంజినీర్లు సమాజాన్ని మార్చే శక్తివంతమైన శిల్పులు అని ఫాపిల్ డ్రోన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో గోపిరాజు అంబులా కొనియాడారు. ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్నోవేట్-2025 పేరుతో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా గోపిరాజు అంబులా మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన ప్రతిభాంశాలకు పదును పెట్టాలన్నారు. ప్రస్తుత కాలంలో ఇంజినీర్లు కేవలం సాంకేతిక నిపుణులు మాత్రమే కాదని, సమాజాన్ని మార్చగల శక్తివంతమైన శిల్పులుగా అభివర్ణించారు. చదివే ప్రతి అంశం నేర్చుకునే ప్రతి నైపుణ్యం భవిష్యత్‌లో తమకే కాకుండా సమాజాన్ని ప్రభావితం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, అధ్యాపకులు ఎన్.రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీఎంసీ నిర్వహణలో ఉండే ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం ఉదయం జక్కంపూడి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వీఎంసీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జక్కంపూడి కాలనీలో డ్రెయినేజీల వద్ద వాటర్ లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనధికార కట్టడాలను తొలగించాలని, దోమలు పెరగకుండా యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహించి ప్రతి రోజు ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రే, డ్రోన్ ద్వారా ఖాళీ స్థలాల్లో, డ్రెయిన్లలో, కాలువల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించాలన్నారు. జక్కంపూడి కాలనీలో ఉన్న బోర్లకు నీటి పరీక్షలు నిర్వహించాలని, ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లన్నింటిలోనూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.